# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 03-01-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1 దేశంలోనే తొలిసారిగా సౌర, పవన విద్యుత్తు సమీకృత ప్రాజెక్టును ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటుచేసే ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది.**

**2. వెనుకబడిన ప్రాంతాలు అభివృద్ధి చెందాలన్నదే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని, కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖ సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ పేర్కొన్నారు.**

**3. తెలంగాణలో పంట సాగు చేసే రైతులందరికీ రైతు భరోసా ఇవ్వాలని మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయించింది.**

**4. ప్రతి ఒక్కరూ పుస్తక పఠనాన్ని అలవరుచుకోవాలని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కె పవన్ కల్యాణ్ అన్నారు.**

**5. తెలంగాణ వ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్లపై యాప్ సర్వే 74 శాతం పూర్తయిందని గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు.**

==========================

దేశంలోనే తొలిసారిగా సౌర, పవన విద్యుత్తు బ్యాటరీ నిల్వ సమీకృత ప్రాజెక్టును ఆంధ్రప్రదేశ్ లో ఏర్పాటుచేసే ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిందని సమాచార, ప్రజా సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను మంత్రి పాత్రికేయులకు వివరిస్తూ..

వాయిస్ ( 33 సెకన్లు)

వీటితోపాటు తిరుపతిలో ఈఎస్ఐ ఆస్పత్రి సామర్థ్యాన్ని వంద పడకలకు పెంపు, అలాగే చిత్తూరు జిల్లాలో ఐఆర్ బెటాలియన్ ఏర్పాటుకు 40 ఎకరాలు కేటాయిస్తూ మంత్రి వర్గం ఆమోదం తెలిపిందని మంత్రి వివరించారు.

-------------------------

వెనుకబడిన ప్రాంతాలు అభివృద్ధి చెందాలన్నదే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని, కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖ సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. వైయస్సార్ జిల్లాలో పర్యటిస్తున్న కేంద్రమంత్రి ఆకాంక్షాత్మక విభాగం కింద జిల్లాలో ఎంపికైన సీకే దిన్నె, జమ్మలమడుగు మండలాల్లో నిన్న పర్యటించారు. బుగ్గలపల్లె

గ్రామంలోని ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. తరువాత జమ్మలమడుగు మండలం మోరగుడి గ్రామంలో స్వయం సహాయక సంఘాల సభ్యులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ,

(వాయిస్ 26 సెకన్లు)

---------------------------

తెలంగాణలో పంట సాగు చేసే రైతులందరికీ రైతు భరోసా ఇవ్వాలని మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయించింది. రైతు భరోసాపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఛైర్మన్‌గా, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్‌బాబులు సభ్యులుగా ఏర్పాటైన ఉపసంఘం చేయాల్సిన సిఫార్సులపై చర్చించేందుకు హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో నిన్న సమావేశమైంది. రైతుల నుంచి దరఖాస్తులు తీసుకోవాలని సబ్ కమిటీ నిర్ణయించింది. అధికారుల సర్వే, శాటిలైట్ మ్యాపింగ్ ద్వారా సాగు భూములు గుర్తించనున్నామని తెలిపింది.

---------------------------

ప్రతి ఒక్కరూ పుస్తక పఠనాన్ని అలవరుచుకోవాలని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కె పవన్ కల్యాణ్ అన్నారు. విజయవాడ పుస్తక మహోత్సవ సంఘం ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ క్రీడామైదానంలో ఏర్పాటు చేసిన 35వ పుస్తక మహోత్సవాన్ని ఉపముఖ్యమంత్రి నిన్న సాయంత్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. పుస్తకాలు చదవడం ద్వారా విజ్ఞానం పెంచుకోవచ్చని చెప్పారు. ఆంగ్లం నేర్చుకుంటూనే మాతృభాషకు ప్రాధాన్యమివ్వాలని పవన్ కల్యాణ్ తెలుపుతూ,

వాయిస్ ( 26 సెకన్లు)

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పరిశ్రమలు ఏర్పాటు అవుతున్నాయని కేంద్ర పరిశ్రమల సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. పశ్చిమగోదావరి జిల్లాలో మంత్రి నిన్న పర్యటించి. పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రామాయపట్నం, అనకాపల్లితో పాటు మరికొన్ని చోట్ల పరిశ్రమలను ఏర్పాటు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా ఉందని అన్నారు. నర్సాపురం మచిలీపట్నం కొత్త రైల్వే లైన్‌కు నివేదిక సిద్ధమైందని చెప్పారు. నరసాపురం పార్లమెంట్ పరిధిలోని ప్రతి నియోజకవర్గంలో త్వరలో కిడ్నీ డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామని వీటి ఏర్పాటుకు 10కోట్ల రూపాయలను కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిందని శ్రీనివాస వర్మ పేర్కొన్నారు.

---------------------------

జనవరి 14 నుంచి 45 రోజుల పాటు ప్రయాగ్‌రాజ్ మహా కుంభమేళా జరగనుంది. ఇందుకోసం ఇప్పటికే ప్రత్యేక రైళ్లను నడుపుతోన్న రైల్వే శాఖ.. తాజాగా తెలుగు రాష్ట్రాల నుంచి వెళ్లేవారి కోసం అదనంగా మరో 26 ప్రత్యేక రైలు సర్వీసులను నడపనున్నట్లు తెలిపింది. ఆంధ్రప్రదేశ్ లోని గుంటూరు, విజయవాడ, మచిలీపట్నం, కాకినాడ టౌన్ తెలంగాణలోని మౌలాలి జంక్షన్, వికారాబాద్, సికింద్రాబాద్ స్టేషన్ల నుంచి ఈ ప్రత్యేక రైళ్లు ఫిబ్రవరి 5 నుంచి 24 వ తేదీ వరకు నడపనున్నామని దక్షిణ మధ్య రైల్వే వెల్లడించింది.

---------------------------

తెలంగాణ వ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్లపై యాప్ సర్వే 74 శాతం పూర్తయిందని గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో ఇందిరమ్మ ఇళ్ల యాప్ సర్వే ప్రక్రియపై గృహనిర్మాణ శాఖ ఉన్నతాధికారులతో మంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సంక్రాంతి తర్వాత గ్రామసభలు ఏర్పాటు చేసి ఇళ్ల లబ్ధిదారుల జాబితా తయారీకి ఏర్పాట్లు జరుగుతున్నాయని చెప్పారు. లబ్ధిదారుల ఎంపిక జాబితాలను జిల్లా కలెక్టర్లు, ఇన్‌ఛార్జి మంత్రుల పరిశీలిస్తారని చెప్పారు. అనంతరం లబ్ధిదారుల ఖాతాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఇచ్చే నగదును విడతల వారీగా జమచేస్తామని మంత్రి తెలిపారు.

---------------------------

తెలంగాణలో వ్యవసాయం, రైతు సంక్షేమం కోసం 30 వేల కోట్లు కేటాయించామని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. సిద్దిపేట జిల్లా కోహెడలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన నిన్న పాల్గొన్నారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ, స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ప్రతి గ్రామాల్లో ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు మంత్రి సూచిస్తూ

వాయిస్ ..(19 సెకన్లు)

---------------------------

దేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు, ప్రముఖ సంఘ సంస్కర్త, నిమ్న వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేసిన జ్యోతిరావు పూలే సతీమణి సావిత్రి బాయి పూలే జయంతి ఈరోజు. 1831 జనవరి 3వ తేదీన మహారాష్ట్రలోని సతారా జిల్లా నయ గావ్ గ్రామంలో ఒక రైతు కుటుంబంలో జన్మించిన ఆమె ముఖ్యంగా మహిళల విద్యాభివృద్ధికి ఎనలేని కృషి చేశారు. సామాజిక మార్పునకు, చైతన్యం పొందడానికి, లింగ సమానత్వం సాధించడానికి విద్యే ఆయుధమని బలంగా విశ్వసించిన పూలేదంపతులు . ఆ దిశగా తమ యావ జీవితాన్ని అంకితం చేశారు. 1897 మార్చి 10వ తేదీన సావిత్రిబాయి పూలే తుదిశ్వాస విడిచారు.

ఇది ఇలా ఉండగా సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా ప్రతి సంవత్సరం జనవరి 3న మహిళా ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ రోజు రాష్ట్రవ్యాప్తంగా 'మహిళా ఉపాధ్యాయ దినోత్సవం' నిర్వహించాలని తెలంగాణ ప్రభుత్వం అన్ని జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసింది.

---------------------------

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల ద్వారా భూ సమస్యలకు సత్వర పరిష్కారం లభిస్తోందని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. ఈమేరకు మంత్రి ఒక ప్రకటన విడుదల చేశారు, రెవెన్యూ సదస్సులకు ఇప్పటి వరకు లక్షా 80 వేల అర్జీలు వచ్చాయని 13 వేల ఫిర్యాదులను అక్కడిక్కడే పరిష్కరించామని తెలిపారు.

======================